A1TV NEWS
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంచిక :01 సంపుటి : 48 బుధవారం 16 08-2023 ఆగస్టు పేజీలు 4. వెల :4 /

# హిందువులందరికీ టీటీడీ పెద్దదిక్కు

## - టీటీడీ చైర్మన్ భూమన



శ్రీమహావిష్ణువు స్వయంభువుగా వెలసిన తిరుమల ప్రదేశంలో భక్తులకు సేవలు అందించడం ఉద్యోగుల జన్మజన్మల పుణ్యఫలమని, హిందూధర్మాన్ని పాటించే హిందువులందరికీ టీటీడీ పెద్దదిక్కుగా నిలుస్తోందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. టీటీడీ పరిపాలన భవనంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ... సనాతన హిందూధర్మాన్ని మరింతగా విశ్వవ్యాపితం చేసేందుకు కృషి చేస్తామన్నారు.%టీటీడీ ఉద్యోగులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందిస్తామని, ఉద్యోగులు అంతర్గత ఇబ్బందులు విడనాడి ఏకంగా సహకరించాలని కోరారు. వడమాలపేట వద్ద టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కోసం మంజూరు చేసిన 310 ఎకరాల భూమిని ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 18న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇంటిస్థలాల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. అవసరమైతే మరో 100 ఎకరాలైనా ప్రభుత్వం నుండి సేకరించి అందరికీ ఇంటి స్థలాలు ఇప్పిస్తామన్నారు

# 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్: ప్రధాని మోదీ

- ఐదేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తామని ప్రకటన
- ఇందుకోసం అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపులను తరిమి కొట్టాలని పిలుపు
- మధ్యతరగతి ప్రజల సామర్థ్యాలు పెరిగినట్టు వెల్లడి




ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం చేసిన సుదీర్ఘ ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు అనే మూడు శత్రువులను భారత్ ఎదుర్కొంటోందంటూ.. వాటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అప్పుడు భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందన్నారు. భారత్ కు స్వాతంత్ర్యం వచ్చిన వందేళ్లకు సరిగ్గా 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని ప్రకటించారు.

"మన దేశం శత స్వాతంత్ర్య దినం జరుపుకునే నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని నేను బలంగా నమ్ముతున్నాను. నా దేశ శక్తి సామర్థ్యాలు, వనరుల లభ్యత ఆధారంగా నేను ఈ మాట చెబుతున్నాను. కాకపోతే ఇందుకోసం మనం మూడు శత్రువులు.. అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపులపై పోరాడాలి" అని ప్రధాని ప్రకటించారు. అవినీతికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దీనిపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలకు చోటు ఉండకూదన్నారు. ఈ సందర్భంగా ప్రధాని కాంగ్రెస్ పార్టీని లక్ష్యం చేసుకున్నారు. "నేడు పరివర్వాద్ (కుటుంబ రాజకీయాలు), బుజ్జగింపులు మన దేశాన్ని నాశనం చేస్తున్నాయి. ఒక రాజకీయ పార్టీకి కేవలం ఒక కుటుంబమే ఇన్ చార్జ్ గా ఎలా ఉంటుంది? వారి జీవిత మంత్రం ఒక్కటే.. పార్టీ అంటే కుటుంబం. కుటుంబం కోసం, కుటుంబం కొరకు" అంటూ విమర్శలు కురిపించారు. "మేము 2014లో అధికారంలోకి వచ్చే నాటికి భారత్ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో 10వ స్థానంలో ఉంది. 140 కోట్ల భారతీయుల కృషితో 5వ స్థానానికి చేరుకున్నాం. లీకేజీలకు చెక్ పెట్టి, ఆర్థిక వ్యవస్థను బలంగా మార్చాం. వచ్చే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకోవడం ఖాయం" అని ప్రధాని చెప్పారు. పేదరికం తగ్గడంతో మధ్యతరగతి సామర్థ్యాలు ఎన్నో రెట్లు వృద్ధి చెందాయన్నారు. గడిచిన ఐదేళ్లలో 13.5 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటకు వచ్చినట్టు చెప్పారు

# ఇప్పుడేమో జగన్ రూ.1 ఇస్తే చంద్రబాబు రూ.100 ద ఇస్తానంటున్నాడు: సజ్జల



టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నిప్పులు చెరిగారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు చెప్పే మాటల్లో ఎప్పుడూ నిజం ఉండదన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందీ చెప్పే ధైర్యం లేదని, ప్రతిపక్ష నేతను మించిన 420 మరొకరు ఉండరని అన్నారు. అమరావతి పేరుతో 3 వేల ఎకరాలను జేబులో పెట్టుకున్నారన్నారు. జనాన్ని ముంచే రియల్టర్‌గా చంద్రబాబు మారాడని ఆరోపించారు. చంద్రబాబు తన హయాంలో ప్రజాజీవితాలను చీకటిమయం చేశారన్నారు.

అధికారంలో ఉండగా ఏమీ చేయనందుకు తనను తాను తిట్టుకోవాల్సిన చంద్రబాబు.. ఇప్పుడు జగన్‌ను తిడుతున్నారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల పేరుతో ఏపీని జగన్ అప్పులపాలు చేస్తున్నాడని, రాష్ట్రాన్ని మరో శ్రీలంకలా మారుస్తాడని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడేమో జగన్ రూ.1 రూపాయి ఇస్తే, తాను రూ.100 ఇస్తానని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో విజయవాడ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు.నాశనం చేయడంలో చంద్రబాబుకు వరల్డ్ రికార్డ్ ఇవ్వవచ్చునని ఎద్దేవా చేశారు. బ్రోకర్ల సాయంతో చంద్రబాబు కృష్ణా జిల్లాను తాకట్టు పెట్టాడన్నారు. జనానికి జ్ఞాపకశక్తి ఉండదని చంద్రబాబుకు అపారనమ్మకమని ఎద్దేవా చేశారు. తన దత్త కొడుకు, సొంత కొడుకు ఇక్కడకు దగ్గరలోనే ఉన్నారని పవన్ కల్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అన్నారు. 2014-19 వరకు ఏం చేశారో వారిద్దరూ చెప్పడం లేదన్నారు. కానీ ఏం చేస్తామో ఇప్పుడు కొత్తగా చెప్పుకుంటున్నారని విమర్శించారు.

# గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చాం..

## స్వాతంత్ర్య వేడుకల్లో జగన్

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ శకటాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రసంగిస్తూ.. అధికారంలోకి వచ్చిన 50 నెలల్లోనే గ్రామ స్వరాజ్యానికి అర్థం తెచ్చినట్టు చెప్పారు.

గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. పౌర సేవల్ని ఇంటింటికీ తీసుకెళ్లినట్టు వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల బలిదానాన్ని గుర్తు చేస్తూ మన జాతీయ జెండా ఎగురుతోందని పేర్కొన్నారు. ఈ 76 ఏళ్ల ప్రయాణంలో దేశం ఎంతగానో పురోభివృద్ధి సాధించిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను మహిళల పేరున ఇస్తున్నట్టు తెలిపారు. రూ. 2.31 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందించినట్టు వివరించారు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదని చెప్పారు.

**పోలవరాన్ని 2025కు పూర్తిచేస్తాం**

సామాజిక న్యాయం నినాదంగా మిగిలిపోలేదని, దానిని అమలు చేసి చూపించామని జగన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చామని, వికేంద్రీకరణతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించామని తెలిపారు. పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయన్న



ముఖ్యమంత్రి.. 2025 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.

**98.5 శాతం వాగ్దానాలు నెరవేర్చాం**

మూతబడిన చిత్తూరు డైయిరీని తిరిగి తెరిచినట్టు తెలిపారు. పేదలకు ఇళ్లు ఇవ్వకుండా అడ్డుకోవడం కూడా అంటరానితనమేనని పేర్కొన్నారు. పేదలు గెలిచే వరకు, వారి బతుకులు బాగుపడే వరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తామిచ్చిన వాగ్దానాల్లో 98.5 శాతం అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా తీసుకొచ్చి అన్ని హామీలను అమలు చేసినట్టు వివరించారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చామని, నాడు-నేడుతో 45 వేల బడుల రూపురేఖలు మార్చామని జగన్ వివరించారు

# గోరంట్ల మాధవ్ కు జగన్ ఎంపీ టికెట్ ఇవ్వడానికి కారణం ఇదే

## - జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తన అన్న జేసీ దివాకర్ రెడ్డిని తిట్టినందుకే గోరంట్ల మాధవ్ కు జగన్ ఎంపీ టికెట్ ఇచ్చారని అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, లేకపోతే ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుకపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే తామే ఇసుకను తోలుకుంటామని అన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు లేరని... కానీ కార్యకర్తలు మాత్రం ఉన్నారని చెప్పారు

# డ్రగ్స్, అవినీతిపై పోరాడుదాం: బాలకృష్ణ

మన దేశంలో డ్రగ్స్, అలసత్వం, అవినీతి వంటి జాడ్యాలు యువతను పట్టి పీడిస్తున్నాయని... వీటిపై పోరాడాలని సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితంగానే మన దేశానికి స్వేచ్ఛావాయువులు వచ్చాయని వచ్చాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో మన దేశంలో ఎంతో మందికి తినేందుకు తిండి గింజలు కూడా లేవని... ఇప్పుడు చంద్రుడిపైకి స్వయంగా కాలుమోపే స్థాయికి ఎదిగామని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని బసవతారకం ఆసుపత్రిలో జాతీయ జెండాను బాలయ్య ఎగురవేశారు. పేషెంట్లకు, చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

బసవతారకం ఆసుపత్రి గత 23 సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు నిరంతరాయంగా సేవలు అందిస్తోందని బాలకృష్ణ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. దేశానికి ఎందరో మహనీయులు సేవలు అందించారని... వారిలో తన తండ్రి ఎన్టీఆర్ ఒకరని చెప్పారు. ఆయన స్థాపించిన బసవతారకం ఆసుపత్రి ఎంతో మంది క్యాన్సర్ రోగులకు నిరంతరాయంగా సేవలందిస్తోందని అన్నారు.



# దళిత ద్రోహి జగన్ మోహన్ రెడ్డి

- తెదేపా ఎస్సిసెల్ అధికార ప్రతినిధి మద్దికెర కైలాస్.

-ఎస్సీలు అంటే జగన్ రెడ్డికి చిన్నచూపు ఎందుకు?

-ఎస్సీలు సంక్షేమానికి , అభివృద్ధికి అర్హులు కాదా ?



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (దళితులను) ఎస్సీ కులానికి చెందిన వారిని సంక్షేమానికి , అభివృద్ధికి దూరంగా పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ అని రాష్ట్ర ఎస్సిసెల్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దికెర కైలాస్ ఆరోపించారు. 2019 మే నెల 30న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత తుగ్లక్ రెడ్డి ఎస్సీ కార్పొరేషన్ ను మూడు కార్పొరేషన్ లుగా (మాల , మాదిగ , రెల్లి ) విభజించి బడ్జెట్ కేటాయించకుండా ఎస్సీలకు సంక్షేమ పథకాలు పంచిపెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని , రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయని కైలాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఆనాటి ముఖ్యమంత్రులు స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు , తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎస్సీలకోసం అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు , ఇన్నోవా కార్లు , జేసిబీలు , ట్రాక్టర్లు , ఆటోలు మంజూరుచేయడమే కాకుండా వాటిని తక్షణమే పంపిణీచేసి యజమానులుగా తయారుచేశారని , ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా ఎస్సీ కాలనీలలో మౌలిక వసతులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కైలాస్ గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటినుండి ఎస్సీల మీద దాడులు , దౌర్జన్యాలు , హత్యలు , శిరోముండనాలు , మహిళలపై అత్యాచారాలు చేయించడమే ద్యేయంగా పెట్టుకున్నారే తప్పా సంక్షేమం , అభివృద్ధి అన్నమాట ఎక్కడా వినబడలేదని ఎస్సీలు అంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చిన్నచూపు ఎందుకని కైలాస్ ప్రశ్నించారు . ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే 27 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేయడం , ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించడంలో దేశంలోనే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మించిన ముఖ్యమంత్రి ఎవరు లేరని , 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వై ఎస్ జగన్ మాట్లాడుతూ దళితులకు చాల అభివృద్ధి పనులు కులాలను విభజించి కార్పొరేషన్స్ చేసేసాని అబద్ధపు మాటలు చెప్పటం సిగ్గుచేటని నీ మాయ మాటలు ఎవరు నమ్మే స్థితిలో లేరని మండిపడ్డారు. మరొకసారి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఎస్సీ కులానికి చెందిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడిచిపెట్టి పోవాలని, సంక్షేమపథకాలు సకాలంలో అందాలంటే , ఎస్సీ కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే 2024 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలి , నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని దీనికోసం రాష్ట్రంలోని ఎస్సీ కులానికి చెందిన వారందరూ పార్టీలకు అతీతంగా తెలుగుదేశం పార్టీని గెలిపించాల్సిన బాధ్యత , ఉండాలనీ కోరుకుంటూ మీ దళిత జాతి ముద్దు బిడ్డ అయిన మద్దికెర కైలాస్ టీడీపీ రాష్ట్ర ఎస్సిసెల్ అధికార ప్రతినిధి

## మౌలిక వసతులకు నోచుకుని అంకాలమ్మ చేంచు గూడెం.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం ఆగస్టు 15:

స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు అయినా గాని అభివృద్ధికి ఆమడ దూరంలో చెంచులు ఉన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేరుకు మాత్రమే ఎస్సీలను ఎస్సీలను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని చెప్తా ఉన్నారు గాని వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. కేవలం దేశ అత్యున్నత పదవిలో ఎస్టిలను కూర్చోబెట్టి వారు కాలం వెళ్ళదిస్తున్నారు ఈరోజు కొమరం భీం ఆదివాసి చేంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై..ఆశీర్వాదం భారత కార్మిక సంఘాల సమాఖ్య( ఐ.ఎఫ్.టి.యు) ( ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కే.అరుణ్ కుమార్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలో ఉన్న చేంచు గూడేల తనిఖీలో భాగంగా ఆలమూరు గ్రామ పంచాయతీలో ఉన్న అంకాలమ్మ గూడెం ను సందర్శించడం జరిగింది, అనంతర వారు మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్రం వచ్చిందని పాలకులు అంటున్నారే గాని నిజమైన స్వతంత్రం ఇంకా రాలేదు అందుకు ఉదాహరణ అంకమ్మ గూడెం ఇప్పటికీ కొన్ని చెంచు గిరిజన గ్రామాలలో మౌలిక వసతులు లేక అనేకఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 80 ఏళ్లుగా చేంచు లు నివాసం ఉంటున్నారు, కనీసం చెంచుల ప్రాథమిక హక్కుల ప్రకారం వీటీడీఏ కమిటీ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు, ఐ టి డి ఏఆఫీసు నుండి ఏఅధికారి సందర్శించిన పాపాన పోలేదు, స్థానికంగా ఉన్న అధికారులు కూడా సందర్శించినపరిస్థితి లేదు, చెంచుల పట్ల వివక్షత చూపెడతా ఉన్నారు. కనీసం గ్రామ పరిధిలో ఉన్న గిరిజన గూడెంలో స్త్రీలకు మరుగుదొడ్లు గాని రోడ్లు గాని 1/70 చట్ట ప్రకారం గిరిజన అభివృద్ధి కోసం ప్రభుత్వం కొన్ని పథకాలు ప్రవేశపెట్టిన గాని వారికి దరిచేయడం లేదు.ఆ చట్ట ప్రకారం ఇప్పటికీ వారికి సెంటు భూమి ప్రభుత్వాలు ఇచ్చింది లేదు, తక్షణమే అంకాలమ్మ గూడెంలో అధికారులు సందర్శించి వారి సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గారు, ఐ టి డి ఏ పి ఓ, జిల్లా అధికారులు వారి సమస్యలు పరిష్కరించాలని వారుకోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శంకర్ అహోబిలంచేంచు గూడెం వి టి డి ఏ కార్యదర్శి ఆవులమ్మ,,రమణమ్మ,నాగరాజు బయన్న తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా 77వ స్వతంత్ర దినోత్సవవేడుకలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:

పట్టణంలోని నడిగడ్డ మాస్టర్ పబ్లిక్ స్కూల్లో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని స్కూల్ కరస్పాండ్ హలీమ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రెండవ వార్డ్ కౌన్సిలర్ సాదిక్ భాష స్కూల్ డైరెక్టర్ దస్తగిరి పర్ల ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి జాతిపిత ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు

ఈ సందర్భంగా చిన్నారులు వేసిన వేషధారణలో చేసిన సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.

## త్యాగ ధనుల కృషి ఫలితమే స్వాతంత్రం.

ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ్డ ఆగస్టు 15:



భారతదేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆళ్ళగడ్డ జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఆళ్ళగడ్డ జనసేన నాయకులు మైలేరి మల్లయ్య అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూఎందరో జాతీయ నేతలు తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన కృషి ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రం ,భారతదేశ స్వాతంత్రానికి అలుపెరగని పోరాటం చేసిన ఎంతోమంది జాతీయ నేతల ఆశయాలని పునికి పుచ్చుకున్న జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ బాటలో పయనించి దేశ అభివృద్ధికి పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మైలారు శ్రీరాములు, మహబూబ్ దౌలా, ఆంజనేయులు, నాగేంద్ర, కేశవ, నయమత్ ఖాన్, అమర్ కాంత్, మంగమ్మగారి ప్రసాద్, కరుణాకర్, జగదీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి ఆగస్టు 15 సందర్భంగా రెండు ప్రశంస పత్రాలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:

వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ఆగస్టు 15 సందర్భంగా అందించే ప్రశంస పత్రాలు కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కి చెందిన జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ శేషులు గారికి, మద్దులేటికి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్, జిల్లా ఇన్చార్జి మంత్రి ఉప ముఖ్యమంత్రి శ్రీ అంజాద్ బాషా చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేయడం జరిగిందని రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు.



ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కు చెందిన నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యుడిగా నాగ శేషు సేవలందిస్తూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల పుణ్యక్షేత్రంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు చేసిన కారణంగా, మద్దిలేటి గారు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేస్తూ సేవాలందిస్తున్నారు, ఈయన ఆధ్వర్యంలో గత నవంబర్ లో ఏర్పాటు చేసిన పోటీలలో టాపర్ గా నిలిచిన రాజేశ్వరి అనే విద్యార్థి నేడు ఐక్యరాజ్య సమితి కి ప్రసంగానికి ఎన్నిక కావటం విశేషం.



## గిరిజనుల అభివృదే ధ్యేయం..

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:

అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న గిరిజనుల సంక్షేమ అభివృదే ధ్యేయంగా జిపిఎస్ నిరంతరం కృషి చేస్తుందని జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ పేర్కొన్నారు.

మంగళవారం స్థానిక గిరిజన బాలికల వసతి గృహంలో జిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక అధ్యక్షతన వసతి గృహ ఆవరణంలో త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించి 77వ స్వతంత్ర దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా బాలికల మధ్యన పండగ వాతావరణం లో గిరిజనులు, గిరిజన సంఘాల నేతలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి లీగల్ సేల్ నంద్యాల అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. గిరిజనులకు సేవ చేసేందుకు తన వంతు సహాయంగా ముందుకు వచ్చి హై ప్రీస్ట్స్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు పవిత్రం మల్ రెడ్డి హాజరై తన సొంత నిధులతో గిరిజన బాలికలకు నోటు పుస్తకాలు, పండ్లు, బ్రెడ్లు స్వీట్స్ వందమంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్, పవిత్ర మాల్ రెడ్డి ప్రతాప్ రెడ్డి, రవి నాయక్ లు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు చదివే ఆస్తి, మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను ఎదగాలని ప్రసంగించారు. గిరిజనుల పట్ల ప్రేమ చూపి వారికి ఆర్థికంగా బలోపేతం చేయడానికి వారికి సాయం సహకారాలు అందించడానికి విచ్చేసిన పవిత్రం మాల్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిపిఎస్ నాయకులు విక్రమ్ నాయక్ హాస్టల్ వార్డెన్ సువర్ణ మరియు వర్కర్లు బాలికలు పాల్గొన్నారు.ఐ

## మహానంది మండలంలో ఎగిరిన త్రివర్ణ పతాకం.



ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 15:

మహానంది మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎగిరిన త్రివర్ణ పతాకం. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా తాసిల్దార్ ,ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, మహానంది దేవస్థానం కార్యాలయాలతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలతో పాటు పంచాయతీ కార్యాలయం ముందు జాతీయ జెండాను అధికారులు ఎగురవేశారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ వారిపై పోరాడిన వీరులు యోధులు వారి చరిత్రలను క్లుప్తంగా వివరించారు. మహానంది క్షేత్రంలో ప్రతి ప్రవేట్ షాప్ పై జెండా ఎగిరేలా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రతి ఒక్కరు కూడా తమ షాపు యందు జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ జనార్ధన్ శెట్టి డిప్యూటీ ఎమ్మార్వో శ్రీనివాసులు ఎంపీడీవో కార్యాలయంలో ఇన్చార్జి ఎంపీడీవో శివ నాగ జ్యోతి మహానంది పోలీస్ స్టేషన్లో ఎస్సై నాగేంద్రప్రసాద్ మరియు సిబ్బంది పాఠశాలలో ఎంఈఓ రామసుబ్బయ్య దేవస్థాన కార్యాలయంలో ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ కే మహేశ్వర్ రెడ్డి సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించారు.

## సిపిఎం కార్యాలయం నందు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా సిపిఐ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఎగరావేసి స్వతంత్ర దినోత్సవం వేడుకలు నిర్వహించిన సిపిఐ నంద్యాల జిల్లా నేతలు ఈ జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ముఖ్య అతిదులుగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు,జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ గారు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, భాస్కర్, నాగరాముడు, ధనుంజయ్,మరియు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ప్రజా సంఘాల జిల్లా నాయకులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు

# జిల్లాలో ఘనంగా 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

## --జిల్లా ఇంఛార్జి మంత్రి అంజాద్ బాషా

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 15:
జిల్లాలో పీఎస్ సి,%ఌ%కెవిఎస్ సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వేడుకగా... కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి అంజాద్ బాషా ముఖ్య అతిధిగా జాతీయ పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు.

ఈ వేడుకల్లో పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్ధర్, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఏఎస్పీ వెంకట రాముడు, డిఆర్ఓ పుల్లయ్య పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సదర్భంగా జిల్లా కలెక్టరు డా.మనజిర్ జిలాని సమూన్,ఏఎస్పీ వెంకట రాముడులతో కలిసి పెరేడ్ మైదానాన్ని జిల్లా ఇంఛార్జి మంత్రి పరిశీలించారు. అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి.

ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి అంజాద్ బాషా సందేశమిస్తూ ఈ జిల్లాలో పుట్టి పెరిగి ఈ ప్రాంత ప్రజల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కలిగించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న, వడ్డే ఓబన్న, నంద్యాల కాదర్ బాద్ నర్సింగరావు, ఆంధ్రతిలక్ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, యాళ్ళూరి స్వామిరెడ్డి, పెండేకంటి వెంకటసుబ్బయ్య, బివి సబ్బారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, గామాగో వంటి మహనీయులందరికీ ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ప్రజల నుండి వచ్చిన 6 వేల 288 అర్జీలలో 4 వేల 851 సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించామని. మిగిలిన వాటిని కూడా కాల



పరిమితిలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 'జగనన్నకు చెబుదాం – జగనన్న సురక్ష కార్యక్రమం కింద 2 లక్షల 92 వేల 595 సర్వీసు రిక్వెస్ట్ లను స్వీకరించి 2 లక్షల 91 వేల 954 సర్టిఫికేట్లను సురక్ష క్యాంపుల ద్వారా పంపిణీ చేసి 99.78 శాతంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. డా.వై.ఎస్.ఆర్. రైతు భరోసా%--%పి.యం.కిసాన్ పథకం క్రింద 2023-24 సంవత్సరంలో డా.వైఎస్ఆర్ రైతు భరోసా మొదటి విడతగా 2 లక్షల 22 వేల మంది రైతు కుటుంబాలకు 56 కోట్ల 17 లక్షల రూపాయలను నేరుగా రైతు యొక్క వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ ఖరీఫ్ లో పంట రుణాల కింద ఒక లక్షా 70 వేల 745 మంది రైతులకు 3 వేల 239 కోట్ల రూపాయల పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందచేశామన్నారు. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో నూతనంగా పామ్ ఆయిల్ సాగు విస్తీర్ణం కోసం ఒక్కో రైతుకు ఒక హెక్టార్ కి 71 వేల రూపాయల రాయితీతో వెయ్యి హెక్టార్లను లక్ష్యంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సర%శీ%లో 5 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేయడానికి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. జూలై మాసంలో 2 లక్షల 14 వేల 261 మంది పింఛనుదారులకు గాను 59 కోట్ల 13 లక్షల రూపాయల పింఛనును గ్రామ/వార్డు వాలంటీర్ ల ద్వార పంపిణి చేయడం జరిగిందన్నారు.

జిల్లా అభివృద్ధిలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో 50 ఎకరాల



విస్తీర్ణంలో 475 కోట్ల రూపాయలతో నూతన మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. శ్రీశైల జలాశయంలో నీటి లభ్యతను బట్టి ఈ ఏడాది కేసీ కెనాల్ కింద 1 లక్షా 75 వేల 388 ఎకరాలకు, ఎస్ఆర్బిసి కాలువల ద్వారా 1 లక్ష 31 వేల 450 ఎకరాలకు, తెలుగు గంగ ప్రాజెక్టు కింద 1,01,600 ఎకరాలకు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4900 వేల ఎకరాలకు, 38 ఎత్తిపోతల పథకాల ద్వారా 38,647 ఎకరాలకు, శివ %ఎ%భాష్యం ప్రాజెక్టు కింద 6 వేల ఎకరాలకు, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 43,304 ఎకరాలకు సాగునీటిని అందించనున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం క్రింద శాశ్వతంగా నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతాలలోని 1 లక్షా 23 వేల గృహాలకు ఇంటింటి కొళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు మొత్తం 87 గ్రామాలలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వేపూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 272 వ్యవసాయ ఫీడర్స్ ద్వారా ఒక లక్షా 67 వేల వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లకు ఉచితంగా విద్యుత్తును అందించడం జరుగుతోందన్నారు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నిర్దేశించిన 76.43 లక్షల పని దినాలకు గాను 61 లక్షల పని దినాలు కల్పించి ఒక లక్షా 55 వేల కుటుంబాలలోని 2 లక్షల 63 వేల కూలీలకు రూ.146 కోట్లను వేతన రూపంలో చెల్లించామన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 105 కోట్ల రూపాయలు పెట్టుబడితో 2,364 సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి 7 వేల మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని శాసనసభ్యులు సచివాలయాల వారీగా ఇంటింటికి వెళ్లి స్థానిక



సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం రూ.20 లక్షల నిధులను మంజూరులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 1088 పనులు మంజూరు చేసి 7 కోట్ల 42 లక్షల రూపాయలతో 274 పనులు పూర్తి చేసామన్నారు.

అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు, ఉద్యోగులకు అతిధులు ప్రశంసా పత్రాలు అందచేశారు. అంతకుముందు డిఆర్డిఏ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, హౌసింగ్ , వ్యవసాయం స్త్రీసంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉధ్యానం, రవాణా, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లైస్, అగ్నిమాపక తదితర శకటాలను ప్రదర్శించి ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే సంబంధిత శాఖలు ప్రదర్శించిన ఎక్సిబిషన్ స్టాళ్లను అతిధులు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించిన పాఠశాల విద్యార్థులకు, శకటాల ప్రదర్శనకు బహుమతులు అందచేశారు.

# ఆలస్యం అయిన న్యాయం గెలిచింది.

### -నేరం చేసిన వాడికి శిక్ష పడింది.

### - నేరం చేస్తే శిక్ష తప్పదు అనేందుకు మినాక్షమ్మ హత్య కేసు...నిదర్శనం...

### - విధినిర్వహణలో మరోసారి శభాష్ అనిపించుకున్న డిఎస్పి మహేశ్వర్ రెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
వై.ఎస్.ఆర్ జిల్లా లో గత 2014 సంవత్సరం లో జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నేరానికి పాల్పడిన ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష 2 లక్షల 50 వేల రూపాయల జరిమానను విధిస్తూ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు హాట్ టాపిక్ గా మారింది.

తొమ్మిదేళ్ల క్రితం ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మినాక్షమ్మ అనే వృద్ధురాలిని కత్తితో గొంతు కోసి హత్య చేసి ఆమె వంటిపై ఉన్న బంగారు, ఇంట్లో ఉన్న వెండి దోచుకెళ్లిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.

మినాక్షమ్మ హత్య కేసును ఛాలెంజ్ గా తీసుకొని దర్యాప్తు అధికారిగా ఉన్న అప్పటి సిఐ ప్రస్తుత నంద్యాల డిఎస్పీ మహేశ్వర రెడ్డి ప్రతిష్టాత్మకంగా కేసును దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలతో కేసును ఛేదించి దోషులకు శిక్ష పడేలా చేసిన కృషికి నేడు కోర్టు తీర్పు తో డిఎస్పీ మహేశ్వర రెడ్డిని పోలీస్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అన్బురాజన్. హత్య చేసిన కేసులో నేర నిర్ధారణ కావడంతో ముద్దాయి పోలు ఆనంద కుమార్ (34) కు యావజ్జీవ కారాగార శిక్ష తో పాటు రూ. 2 లక్షల 50 వేలు జరిమానా విధిస్తూ సోమవారం ప్రొద్దుటూరులోని రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి



శ్రీ జి.ఎస్.రమేష్ కుమార్ తీర్పు ఇచ్చారు. శభాష్ పోలీస్ అంటున్న ప్రొద్దుటూరు ప్రజలు. నేరం చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు.

# మహిళల ఆర్థికాభివృద్ధి టిడిపి తోనే సాధ్యం : గంగాదేవి



ఆంధ్ర ప్రగతి వెలుగోడు ఆగస్టు15 :
రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధి తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యమని శ్రీశైలం నియోజకవర్గ మహాశక్తి కన్వీనర్ మహానంది గంగాదేవి అన్నారు. మంగళవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడు మండలం బోయ రేవుల గ్రామంలో మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశక్తి పథకం ద్వారా మహిళలను ఆదుకునేందుకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు. సీఎం జగన్ ఎన్నికల్లో మహిళకు మాయమాటలు చెప్పి అరచేతిలో భూతల స్వర్గం చూపించాడని, నవరత్నాల పేరుతో నవమోసాలకు తెరలేపాడని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ మహిళలను దగా చేసిందని అందుకే మహిళలకు న్యాయం చేసేందుకు చంద్రబాబు మహాశక్తిని రూపకల్పన చేసారని చెప్పారు. 18నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందుతుందని, అలాగే ఆడబిడ్డ నిధి (మహిళానిధి) పేరుతో మహిళాసాధికారత కల్పించడంతోపాటు ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళ నేతలు నూర్ జహాన్, మైమున్నిసా, వెంకట లక్ష్మమ్మ, మండల నాయకులు శేష రెడ్డి, కలిలుల్లా, అమీర్ అంజా, డా.జకీర్, రామ నాయుడు, హిదయత్ ఖాన్, రసూల్, అబ్దుల్లా పురం బాషా, బోయ రేవుల గ్రామ నాయకులు సూర్య నారాయణ రెడ్డి, నాగ శేఖర్, మాజీ సొసైటీ చైర్మన్ కృష్ణా రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల త్యాగఫలాలను గుర్తుంచుకోవాలి.

ఆంధ్ర ప్రగతి పాణ్యం ఆగస్టు 15:
ఆగస్టు15,స్వాతంత్ర్య కోసం ఆంగ్లేయులతో పోరాడిన మహనీయుల త్యాగఫలాలలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

77వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంళవారం ఉదయం పాణ్యం మండల కేంద్రంలోని మువ్వన్నెల జెండాను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు,కళాశాలల్లో పోలీస్ స్టేషన్లో ,ఇతర ప్రైవేట్ పాఠశాలలు మరియు ఇతర సముదాయల్లో జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు, టీచర్లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

మహాత్మాగాంధీ,సుభాష్ చంద్రబోస్, నెహ్రూ,భగత్ సింగ్ వంటి ఎందరో త్యాగమూర్తుల పోరాటం వల్ల సిద్ధించిన స్వాతంత్ర్యం 76 సంవత్సరాలు పూర్తిచేసి 77వ ఏడాదిలోకి అడుగిడిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నామన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాల్గొన్న న్యాల్కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్

సంగారెడ్డి) జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆవరణలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ శుభసందర్భంగా జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి 'జెండా అవిష్కరణ' కార్యక్రమంలో పాల్గొన్న న్యాల్కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్.ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన ఎందరో మహానుభావుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పునరాంకితం కావాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలందరికి 'స్వాతంత్ర్య దినోత్సవ' శుభాకాంక్షలు అనీ కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్,జడ్పీటీసీ ల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,సిఈఓ ఎల్లయ్య,సహచర జడ్పీటీసీ సభ్యులు సునీతమనోహర్ గౌడ్,కొండల్ రెడ్డి, అరుణమోహన్ రెడ్డి,రమేష్, మీనాక్షి సాయికుమార్,అపర్ణ శ్రీకాంత్,రాజు రాథోడ్,జిల్లా పరిషత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలి.

-నేడు గాంధీలు ఆంగ్లేయులు మధ్య పోరాటం -నేడు గాంధీ వారసులు గాడ్సే వారసుల మధ్య పోరాటం.

-ప్రధాని ప్రసంగం స్వాతంత్ర దినోత్సవం కోసం కాదు తన ఎన్నికల మేనిఫెస్టోగా చెప్పుకున్నాడు.

-జే లక్ష్మీ నరసింహ యాదవ్ డిసిసి అధ్యక్షుడు నంద్యాల పార్లమెంట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ & ఏఐసీసీ మెంబర్.

ఆంధ్ర ప్రగతి కల్లూరు ఆగస్టు 15:
ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ డిసిసి అధ్యక్షుడు జే లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు
మంగళవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం దామోదర సంజీవయ్య భవన్ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి 77వ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు లక్ష్మీ నరసింహ యాదవ్ గారు అశోక చక్ర సంహిత త్రివర్ణ జాతీయ పథకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహ యాదవ్ గారు మాట్లాడుతు
15 ఆగస్టు 2023న, తన ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్లలో ఏమి సాధించిందో ప్రజలకు నివేదించడం కంటే, ప్రధాని మోదీ వక్రీకరణలు, అబద్ధాలు, అతిశయోక్తులు మరియు అస్పష్టమైన వాగ్దానాలతో నిండిన ఎన్నికల ప్రసంగం చేశారు. నేడు కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో వైకాపాలన రాజ్యాంగ పునాదులు కదులుతున్నాయి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది గాంధీ వారసులకు గాడ్సే వారసులకు మధ్య సైదాంతిక పోరాటం జరుగుతుంది అందువల్ల మరో స్వాతంత్ర పోరాటానికి దేశ ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు సంసిద్ధం కావాలని లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి , జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగలింగం , జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు పటాన్ అబిబ్ ఖాన్ , పాణ్యం నియోజకవర్గ కోఆర్డినేటర్ సభ్యుడు సాంబశివుడు , జిల్లా కిసాన్ సెల్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్ , కల్లూరు మండలం అధ్యక్షుడు దస్తగిరి , కల్లూరు మండలం బీసీ సెల్ అద్యక్షులు శేఖర్ , రఘు , శ్రీనాథ్ , అమర్ ,




రమణ, షైక్షవలి, మరియు మిగతా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల నివారణకు చర్యలు

- ప్రజల్లో చైతన్యం వచ్చేలా కార్యక్రమం

విజయవాడ,ఆగస్ట్15 :
గ్రామల్లో అంటువ్యాధుల నివారణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటు న్నారు. ఇటీవలి వర్షాలకు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహాయక చర్యలు తీసుకున్నారు. పచ్చదనానికి తోడు పరిశుభ్రతతో ప్రజలకు వైద్యం చేరువ చేసే కార్యక్రమం ఊపందుకుంది. ఆస్పత్రుల్లో పెద్ద ఎత్తున వసతుల కల్పనతో పరిస్థితి మారుతోంది. వ్యాధి నిరోధక టీకాలైన మిజిల్స్, రుబెల్లా తదితర వ్యాక్సిన్‌ల ద్వారా వ్యాధినివారణకు ప్రభుత్వం నడుం బిగించింది. నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు మిజిల్స్, రుబెల్లా, తట్టు టీకాలను వేయించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. గతంలో వేయించిన పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో అదనపు డోసును వేయించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలతో పాటు జిల్లా వైద్యాధికారులు వ్యాక్సినేషన్ పై ప్రచారం జరుపుతున్నారు. జిల్లాల్లోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, బస్తీల్లో పోస్టర్లు, కరపత్రాలతో పాటు అవగాహన సదస్సుల ద్వారా టీకాలపై ప్రచారం, అవగాహన కల్పించారు. వ్యాధులు వచ్చిన తరువాత దవాఖానలకు పరుగెత్తడం కంటే రోగాలు రాకుండా ముందుజాగ్రత్త పడడమే ఉత్తమమని, అందుకోసం వ్యాధినిరోధక శక్తిని పెంచే టీకాలు వేయించాలని వైద్యులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటుందని పలు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చెబుతున్నారు. వ్యాధులు రాకుండా ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుకోవడం, ఒక వేళ రోగాలు వ్యాపిస్తే వాటిని ప్రారంభదశలోనే గుర్తించి, సరైన చికిత్స చేయడం తదితర వాటిపై వైద్యాధి కారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ టీకాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, వాటిపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోనవసరంలేదని వైద్యాధికారులు స్పష్టం చేశారు. గతంలో వేయించుకున్నవారు మళ్లీ వేయించుకోవచ్చని సూచిస్తున్నారు.

# స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలైనా ప్రాంతీయ అసమానతలు తొలగిపోలేదు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
బానిస సంకెళ్లు తొలగి 76 సంవత్సరాలైనా భారతదేశంలో ప్రాంతీయ అసమానతలు తొలిగిపోలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఆవేదన వ్యక్త పరిచారు.
77 వ స్వాతంత్ర్య వెడుకలను పురస్కరించుకుని నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయ ఆవరణలో జాతీయజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితోనే దేశ సమగ్రాభివృద్ధి ముడిపడిందని కానీ ఆ దిశగా ప్రభుత్వాలు పనిచేయక పోగా తమ రాజకీయ అధిపత్యం కోసం, అధికార పగ్గాల కోసం ప్రాంతీయ అసమానతలు సృష్టించి తమ రాజకీయ లక్ష్యాలను సాధించుకుంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ప్రాంతాలన్నింటిని సమాన దృష్టితో చూడకపోవడం వల్లనే నేటికి కొన్ని ప్రాంతాలు అభివృద్ధి నోచుకోకపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జాతీయోత్పత్తిలో అగ్రస్థానం వ్యవసాయ రంగానిదేనని, వ్యవసాయ అభివృద్ధి కొరకు ఆయా ప్రాంతలలోని నీటి వనరులను సద్వినియోగంతోనే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయని, కానీ దురదృష్టవశాత్తు నేటి రాజకీయ వ్యవస్థ ఆ దిశగా పయనించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి ఆధునిక యుగంలో కూడా చాలా ప్రాంతాలు త్రాగునీటి కోసం తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపై స్పందించి త్రాగు నీరు అందరికీ అందేటట్లుగా ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ, త్రాగు, సాగు నీటికోసం ఆయా



ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం జరిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ దిశగా ప్రభుత్వాలు పని చేసినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, రామచంద్రారెడ్డి, సౌదాగర్ ఖాసీం మియా, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఎ.జి.యం.శివనాగిరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, కొమ్మా శ్రీహరి, షణ్ముఖరావు, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ పుస్తకం ఆదర్శం కావాలి

- వారి కృషి ఫలితమే మన స్వాతంత్ర్యం

న్యూఢిల్లీ,ఆగస్ట్15 :
ఓ్గ÷క వివేకానందుడి దేశభక్తి... ఒక భగత్‌సింగ్ ఆత్మశక్తి, ఒక గాంధీజీ ఆశయస్ఫూర్తి.తో మనమంతా ముందుకు సాగాలి. అలా సాగితేనే డే మనం నిజమైన భారతీయులం. భగత్ సింగ్ రాసిన పుస్తకం 'నా నెత్తురు వృథా కాదు...' వాస్తవానికి ఒక సునామీ. భగత్‌సింగ్ మనోభావాలు అవగతమైతే, మనకు నరనరాల్లో విద్యుత్తు ప్రసరిస్తుంది. నెత్తురు ఉడుకుతుంది. దేహం పులకిస్తుంది. 'నన్ను మీరు చూడాల్సింది- నేరస్థుడిగా కాదు, యుద్ధఖైదీగా... నేను చేసింది నేరంకాదు, యుద్ధం... నేను గురికావాల్సింది ఉరితాడుకు కాదు- ఫిరంగికి!' అంటూ, 'రండిరా... ఇదే కాల్చుకొండిరా' అని గర్జించిన మన టంగుటూరి ప్రకాశం మాదిరే భగత్‌సింగ్ నిప్పులు చెరిగాడు. బలిదానానికి సిద్ధపడ్డాడు.లండన్ పోయి బారిస్టర్ చదువుతానన్న పెద్దకొడుకుతో మహాత్మా గాంధీ ఏమన్నారో తెలుసా? 'సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళడమే అంతకన్నా విలువైన విద్యాభ్యాసం. కారాగారం దేశభక్తిని అలవరుస్తుంది. క్రమశిక్షణను నేర్పిస్తుంది. చదువుల పరమలక్ష్యం అదే. ఈ దేశంకోసం పోరాడటమే నీ తక్షణ కర్తవ్యం' అన్నారు. నేటి భారతీయులలో అత్యధిక శాతానికి నాటి స్వాతంత్య పోరాటంలో భాగస్వాములయ్యే అదష్టం లేదనే చెప్పాలి. ఇప్పటి మనలో చాలామందికి అప్పటి రోజుల్లో దేశం కోసం ప్రాణత్యాగం చేసే అవకాశం లేదు. కానీ, మన జాతి ప్రగతికి, మన స్వాతంత్య సమరయోధులు కలలుగన్న భారతదేశ నిర్మాణానికి వీలైనంత మేర శ్రమించడం కోసం మనం జీవించాల్సిన సమయమిది. బాపూజీ కలలు సాకారం చేసే గొప్ప అవకాశం ఇవాళ మన చేతుల్లో ఉంది. పరుల బాధను తన బాధగా భావించగలవారే నిజమైన మహనీయులు అన్నది బాపూజీకెంతో ఇష్టమైన శ్లోకం. ఏ భారతదేశం కోసం బాపూజీ తన జీవితాన్ని తృణప్రాయంగా అర్పించారో, ఎలాంటి సౌభాగ్య భారతం గురించి కలలుగన్నారో దాన్ని సాకారం చేయడం కోసం నేడు కొన్ని కోట్లమంది భారతీయులంతా చిత్తశుద్ధితో కలసికట్టుగా కృషిచేస్తున్నారు. వారి స్ఫూర్తితో ముందుకు సాగడమే మనకర్తవ్యం కావాలి.

## సంపాదకీయం

# ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలి !

మంగళవారం 15-8-2023

ఏటా స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నా..గంభీరమైన ఉపన్యాసాలు ఇస్తున్నా దేశం గురించి నేతలు ఆలోచిస్తున్నారా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే నానాటికి తీసికట్టు నాగం భొట్లు అన్న చందంగా పరిస్థతితి తాయరవుతోంది. దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా భారత స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మువన్నెల జెండా రెపరెపలాడింది. ఆకాశాన్ని ముద్దాడుతుందా అన్న రీతిలో త్రివర్ణ పతకాలు ఎగురవేశారు. ప్రజలంతా తమవంతుగా దేశభక్తిని చాటారు. నేతలు కూడా జెండాలు ఆవిష్కరించారు. ఊరూవాడా త్రివర్ణపతాకం ఎగిరింది. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొని ఐక్యతను చాటారు. మనమంతా ఒక్కటే అని చాటారు. ఇదే సందర్భంలో మనం మనదేశ పురోగతిపై మననం చేసు కోవాలి. నేతలంతా ఆత్మవిమర్శ చేసుకోవాలి. మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా చేస్తున్న ప్రయత్నాలు ఎందుకో చెప్పాలి. ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటిగా ఉందన్న కితాబులతో ఉప్పొంగి పోకుండా క్షేత్రస్థాయి పరిశీలనలతో ప్రజల సమస్య లను పరిష్కరించే సత్తా చూపాల్సిన బాధ్యత పాలకులదే. అప్పుడే మన మనుగడకు అర్థం కలుగుతుంది. మన దేశంలో స్టార్టప్ కంపెనీలు మంచి విజయం సాధిస్తున్నా.. యూనికార్న్ కంపెనీల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా..ఉపాధి, ఉద్యోగ రంగాల్లో దారుణ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇది దేశాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్యగా చూడాలి. మన ఆర్థిక వ్యవస్థ బలపడడానికి స్టార్టప్ కంపెనీలు దోహదపడు తున్నాయని చెప్పుకుంటున్నా..ఉద్యోగ కల్పన మాత్రం కానరావడం లేదు. మనం సాధిస్తున్న అభివృద్ధి ఖచ్చింతంగా పేదలకు చేరాలి. అప్పుడే మనం అభివృద్ధి సాధించినట్లు చెప్పుకోవాలి. దీర్ఘకాలంలో ఉపయోగ పడేలా ఆర్థిక సంస్కరణలు చేపట్టాలి. విధాన నిర్ణయాలు అమలు చేయాలి. ఆర్థిక విజయం ప్రజల జీవితాలను సులభతరం చేసేలా ఉండాలి. దేశాన్ని,రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చిత్తశుద్ధి కావాలి. నాయకుల్లో పరివర్తన రావాలి. గంభీరమైన ఉపన్యాసాలు కాకుండా చిత్తశుద్ధితో పనిచేసే సంకల్పం కావాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చగలిగేలా పనిచేస్తామన్న సంకల్పం రావాలి. ఇన్నేళ్లయినా సామాన్యుల బతుకులు బాగుపడడం లేదు. నాయకులు అభివృద్ధి చెందుతున్నారు. అధికారం అనుభవిస్తున్నారు. కానీ ప్రజల బతుకులు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. ఈ పరిస్థితి మారాలంటే నాయకుల్లో మార్పు రావాలి. వారి ఆలోచనా ధోరని మారాలి. తామంతా దేశ సేవకోసం అధికారం చేపడు తున్నామన్న ప్రతిజ్ఞ చేసుకోవాలి. ఎందుకంటే నెహ్రూ నుంచి నేటి వరకు మన స్వతంత్ర భారతావనిలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ఇప్పటికీ ఎదురవుతూనే ఉన్నాయి. ప్రధానంగా ఉగ్రవాదం, నిరుద్యోగం, మాదకద్రవ్యాల వాడకం పెచ్చుమీరాయి. ఉగ్రవాదులు విదేశీ గడ్డపై నుంచి సవాళ్లు విసురు తున్నారు. దేశ విభజనతో ప్రత్యేక దేశంగా ఏర్పడ్డ పాకిస్తాన్ తన కుత్సిత బుద్ధితే తన దేశంలో ఉగ్రవాద ఫ్యాక్టరీని పెట్టి సవాళ్లు విసరుతోంది. దీంతో ఎంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. సరిహద్దుల రక్షణలో జవాన్లు అమరులవుతున్నారు. ఈ సవాళ్లను అధిగమించేలా ప్రజలను చైతన్యం చేసేలా పాలకులు సంకల్పం తీసుకోవాలి. ప్రధానంగా రాజకీయ అవినీతి ప్రజాస్వామ్యానికి పట్టిన చీడగా గుర్తించాలి. పాలకులు ప్రజాస్వామ్యాన్ని ప్రైవేట్ వ్యాపారంగా చూడరాదు. ఇడి కేసులంటే వేధింపులుగా చూపుతూ తమ డొల్లతనాన్ని చాటుకుంటున్నారు. విచారణలను రాజకీయ కక్షలుగా చూపుతున్నారు. నీతులు వల్లించే నేతలంతా అవినీతికి కొమ్ముకాశారు. ఆకలి, దరిద్రం, మందుల కొరత, ఆహారాధాన్యాల ధరలు, ప్రజలను పట్టిపీడిస్తున్నా..పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా రాజకీయాలు నడుపుతున్నారు.
ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసలైన శక్తిసామర్థ్యాలను గుర్తించడంలో ప్రపంచానికి భారత్ తోడ్పాటును అందించి సత్తా చాటుతున్న వేళ దేశంలో ఉన్న సమస్యలను గుర్తించాలి. అణగారిన వర్గాలు, పేదలు, అవసరాల్లో ఉన్నవారి పట్ల దయార్ధ్ర హృదయంతో ముందుకు సాగాల్సి ఉంది. ఈ దేశ సంపద ఏ కొందరిదో కాకుండా..అందరిదీ అన్న సంకల్పం చాటాలి. ఆర్థిక సంస్కరణలతోపాటు వినూత్న ప్రజా సంక్షేమ పథకాలతో దేశం ముందడుగు వేస్తోందని చెప్పుకుంటున్న పాలకుల అవి ఏ మేరకు ప్రజలకు మేలు చేస్తున్నాయో విశ్లేషంచుకోవాల్సి ఉంది. సమున్నతంగా ఎదుగు తున్న నూతన భారత్‌ను ప్రపంచం కీర్తిస్తోంది. దీనిని కాదనలేం. కానీ ఇదే సందర్భంలో దేశాన్ని పట్టి పీడుస్తున్న అనేకానేక సమస్యల పై పోరాటంలో పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. పేదరికం, నిరక్షరాస్యత తాండవిస్తున్నది. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది... దినదిన ప్రవర్ధమానమవుతోంది... అని ప్రకటించుకోవడం కాదు..ప్రజలు ఏ మేరకు దానిని పొందగలుగుతున్నారన్నదే ముఖ్యం. దేశ భద్రత, ప్రగతి, సౌభాగ్యం కోసం ప్రజలు సర్వశక్తులూ ధారపోస్తున్నారు. అయితే ప్రాంతీయ అసమానతలను తగ్గించడంతోపాటు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలకులు తీసుకుంటున్న చర్యలు అంతగా ప్రతిఫలించడం లేదు. పెరిగిన ధరలు సామాన్యులను, మధ్యతరగతి ప్రజల ను సొంతింటి కలకు దూరం చేస్తోంది. మనం స్వేచ్ఛగా జీవించేందుకు ఎంతోమంది మహనీయులు ఎన్నో త్యాగాలు చేశారు. వారిని స్మరించుకోవాల్సిన సందర్భం ఇది. వారి త్యాగాలను కేవలం కొందరే అనుభవిం చడం అభివృద్ధి కాదు. ముఖ్యంగా మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నా..వారికి రక్షణ లేకుండా పోయింది. నిర్భయంగా వారు బజారులో తిరిగే పరిస్థితి లేదు. ఈ సమస్యలను ఆకళింపు చేసుకుని విధానాలు రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేస్తూ పోతేనే మనం సమగ్రాభివృద్ధి సాధించగలం. మన భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలదు.